**త్యాగం, కరుణ, ప్రేమ, సమభావన వంటి విలువలు గుర్తుకు వచ్చే క్రైస్తవ మతంలో కూడా కులం విస్తరించి ఉంది. గురువులే కాదు, ప్రజలు సైతం కమ్మ, రెడ్డి, బిసి, దళితులు- ఇలా కులాలవారీగా ఇక్కడ కూడా చీలిపోయే ఉన్నారు. ఏదో సమానత్వ భావన దొరుకుతుందని ఆశతో పోయిన క్రింది కులస్థులకు ఇక్కడా అవే అవమానాలు.**

పి. చిన్నయ్య

5

# ముత్తమ్మ ఉరఫ్ మరియమ్మ సమాధి





'నీతిమంతుని నాలుక న్యాయం, ధర్మం, జ్ఞానం బోధించును... పితపుత్ర పవిత్ర ఆత్మనామమున... ఆమెన్...' సరిగ్గా పూజ మొదలయ్యే సమయానికి వేగంగా గుడి ఆవరణలకొచ్చి ఫాదర్ నివాసానికి, చర్చికి మద్యనున్న వేపచెట్టు కింద మోపెడ్‌ను పెట్టి, చర్చి ప్రధాన ద్వారం వైపు మోకరిల్లి స్లీవగుర్తు వేసుకున్నడు.

ఈ మానసిక స్థితిల చర్చిలోకి పోవాలనిపించలె. పొద్దున్నె పరగడపనె వచ్చినా ఫాదర్ కలువకపాయె.

కాస్తొ ముందుగా రాకపోతినని బాదపడుతు ఏంచేయాలో తోచక నీరసంగ పక్కనున్న సిమెంట్ బెంచిమీద కూర్చుంటు, దానిమీద పేర్లను చూశాడు. కీ॥శే॥ శ్రీమతి చంద్రమ్మ మరియు యాదయ్యగారి జ్ఞాపకార్థం అని రాసుంది. తల్లిదండ్రుల పేరు మీద అయిదు బెంచీలు చర్చికి ఇచ్చింది అతనే!

రాత్రి సరిగ తినక, నిద్రలేమితో అలసినట్టుంది. చర్చిల ప్రార్థన పూర్తవ్వాలంటే గంటవుతుంది. అప్పటిదాక ఫాదర్‌ను కలువలేడు.

లేచి నెమ్మదిగా చర్చి ముందున్న హోటల్‌కొచ్చాడు. చర్చి కొచ్చినపుడల్లా అక్కడే భార్య మరియమ్మతో టిఫిన్ తినుడు అలవాటె. హోటల్ యజమానురాలు మేరి మంచి పరిచయమె. అప్పుడప్పుడు డబ్బులు చేబదులో, అప్పుగానో తీసుకుంటది.

టేబుల్ మీదున్న జగ్గు తీసుకొని, కొద్ది దూరం పోయి నోరు పుక్కిలించి, మొఖం కడిగి, కుర్చి మీద కూర్చుని నీళ్లు తాగుతుండగా,

"అయ్యో జ్వాన్నేసు, ఇంతకుముందే తెలిసింది. మంచోళ్లనే తీసుకెల్తడు దేవుడు. ఆ తండ్రి, కరుణామయుడు తప్పక తన చెంతకు చేర్చుకుంటడు, బాదపడకు..." అలసిపోయిన మొఖాన్ని చూస్తూ ఇడ్లీ పెట్టింది.

ఆకలిగుండటంతో వెంటనే తిన్నాడు.

చాయ్ తాగాక శరీరం స్థిమితపడ్డట్టయింది. చాలా రోజుల కింద మానేసిన సిగరెట్ తాగాలని కుతిలేసినా, భార్య దేవమాత మీదేయించిన ప్రమాణం గుర్తొచ్చి కోరికనాపుకుండు.

"సమాధి ఏర్పాట్లు ఎవరు చూస్తున్నరు?" సమాధిని ఎక్కడ పెడుతున్నరని అడగలేక అడిగింది విషయం తెలిసి కూడా!

“మా మరదలు కొడుకు అశోక్ చూస్తుండు...”

“ఫాదర్‌ను తీసుకెళ్లావా!”

“లేదు మేరమ్మగారు,” బాదతో మరియమ్మ కోరిక ఏమిటో చెప్పాడు

“అట్లనా!” అందిగాని ఆమె ముఖంలొచ్చిన మార్పుల్ని పసిగట్టలె జ్వాన్నేసు.

“కులపెద్దలు ఫాదర్ ఒప్పుకుంటె అయిపాయె?” అసంతృప్తి బయట పడకుండానె అంది సున్నితంగా.

“అందుకే మేరమ్మ, రాత్రి ఫాదర్‌కు చెప్పిన, పెద్దమనుషులతో మాట్లాడి చెబుతనన్నడు...” అతని మాటలు వింటున్నట్లు తలూపుకుంట పాత్రల ఉడికిన ఇడ్లీలను తీస్తూ, హాట్‌బాక్స్‌ల పెట్టసాగింది.

టైం చూసుకుండు జ్వాన్నేసు. పూజ పూర్తయ్యేలోపు పెద్దమనిషి శౌరిరెడ్డిని కలసొస్తే? అనుకున్న తడవుగా లేచి బయలుదేరాడు. ఇతని మాట ఊర్ల ఎవరూ కాదనరు. పైగా చర్చికొచ్చినపుడు ఎంత మర్యాదగా పలుకరిస్తడు!

ఆ నమ్మకంతో గేటు తీసి విశాలమైన ఇంట్లకు అడుగుపెట్టాడో లేదో కాస్త బయమేసింది. ఇదే మొదటిసారి లోపలికి రావటం. ఓ మూలకు ట్రాక్టర్ కారు, ఇంకో మూలకు కొట్టంలో బర్లు, ఎద్దులు కనిపిస్తున్నాయి. జ్వాన్నేసు రాకను గమనించి, తాగుతున్న టీ కప్పును లోపలపెట్టి ఎదురుపోయి, అక్కడే ప్లాస్టిక్ కుర్చిలున్నా కూర్చోమనకుండానే.

“ఏమిటి, జ్వాన్నేసు ఇలా వచ్చారు?” మర్యాదగా అడిగాడుగాని అతని రాకను ఊహించిందె!

“ఫాదర్ ఏమి చెప్పలేదా శౌరెడ్డిగారు?” కాళ్లు వొణుకుతున్నయి.

“చెప్పాడుగాని ఎటు నిర్ణయంకాలే, ఊరోళ్లతో ఇంకా మాట్లాడేదుంది.”

“తొందరగా ఏ విషయం చెబితె, ఏర్పాట్లు చేసుకుంటము...” బతిమిలాడాడు

“అదిగాదు జ్వాన్నేసుగారు, ఇటువంటిదెపుడు ఈ గూడెంల జరగలేదు. కులపోళ్లు ఒప్పుకోవటంలే, మళ్లోసారి అందర్ని అడిగిచూస్తా. వాళ్లు ఒప్పుకుంటనె, నా చేతులేముంది చెప్పు?” తెలివిగా గూడెం వాళ్లమీదకు నెట్టిండు.

“మంచిది శౌరెడ్డిగారు, చర్చి దగ్గరుంట,” ఆడుండలేక బయటకొచ్చాడు.

ఏం జరుగుతుందో అర్థంకావటంలేదు. ఈ గూడెం వారంత తనకు కావల్సినోళ్లు అనుకున్నడు. అందరు దేవుని బిడ్డలె, జనమంత సమానులేనని నమ్మిండు. కాని ఏదో తేడా కనిపిస్తుంది వీరిలో.

“జ్వాన్నేసు...” పక్కింటి నుండి పిలుపు విని అటువైపు చూశాడు. అది చిన్నప్ప రెడ్డిల్లు. పొద్దున ఇతన్ని కూడా కలువాలనుకున్నడు. గందరగోళంలో గుర్తుకురాలె, అటువైపు నడిచాడు.

ఇంట్లకు రాగానే ముందు రూంల కుర్చీ వేసి, "చాయ్ తాగుతవా?" అడిగాడు మార్యాదకు.

"వొద్దులె చిన్నప్పరెడ్డి."

ఇద్దరికి మంచి స్నేహముంది. పై కులపు క్రైస్తవ బిడ్డలు ఇంటికొస్తే మంచి మర్యాదలు చేసేది మరియమ్మ!

"చర్చి మీద గంటకొట్టినపుడు తెలిసింది. మరియమ్మ చనిపోయిందని, పనయ్యాక వద్దామనుకున్న..." చిన్నప్పరెడ్డి మాటలకు కన్నీళ్లు పెట్టుకుండు జ్యాన్నేసు.

అప్పటికే చిన్నప్పరెడ్డి తాగినట్టుంది.

"అయినా ఈ గూడెపోళ్లు ఎట్ల ఒప్పుకుంటరనుకున్నవు? పెద్దమనుషులంత దొంగలు, గురువులు నీతులు చెప్పెటోళ్లెగాని, నిజాయితీ గుండెటోడు ఎవరు చెప్పు జ్యాన్నేసు?" తూలుతు లేచాడు.

చిన్నప్పరెడ్డి చిత్రమైన మనిషి. తాగితే నోరు జారుతడుగాని, మాట మీదుంటడు. ఎన్నిసార్లు తనింట్ల మందు తాగుతూ పెద్దమనుషులను తిట్టలె. ఫాదర్లను తిడుతుంటె మరియమ్మ అడ్డుకునేది అలా తిట్టొద్దని, పాపంల పడతవని హెచ్చరించేది.

"నా భార్యను ఉంచుకుంటె వాడు పాపంల పడడా?" ఏడుస్తూనె బాదనంత ఎళ్లగక్కెటోడు...

చిన్నప్పరెడ్డి ఐదెకరాల రైతు. ఏమైంది ఏమోగాని, మొదటి భార్యకు ఓ చర్చి ఫాదర్‌తో సంబంధముందనె అనుమానంతో గొడవలు, చివరకు భార్యను కొట్టుడు దాకొచ్చింది. ఇతనితో ఉండలేనని కూతురును భర్త దగ్గరే ఒదిలేసి ఎల్లిపోయింది. పాదర్లంటే అందుకే కోపం. రెండో పెళ్లి చేసుకున్నాక కొడుకు, కూతురు పుట్టారు. పెళ్లిల్లకో, సావులకో తప్ప చర్చికి పోడు. అంత బాగనె ఉంటదిగాని గా కమ్యునిస్టులతో చిన్నప్పరెడ్డి తిరుగుడు నచ్చేదికాదు జ్యాన్నేసుకు! చర్చి దగ్గరకు పోదామని లేవగానె,

"చూడు జ్యాన్నేసు, ఎట్లొచ్చి ఈ మతంలో కలిసినవోగాని, ఈ కులపోళ్లు నిన్ను కలుపుకోరు. నిన్న రాత్రి కులపెద్దలు, ఫాదర్ కలిపి మాట్లాడుకున్నరు. పెద్ద వాదనయ్యిందట. ఈడ సమాదె పెట్టనీయొద్దని కొందరంటె, వేరే కులపోళ్లను దూరంగ ఇంకో మూలకు పెట్టుకొనిస్తే ఎట్లుంటదని ఇంకొందరన్నరంట. నీవు అప్పులిచ్చె హోటల్ మేరి గూడ ఈడ సమాధి పెట్టనీయొద్దని గట్టిగా వాదించిందట. చివరికి గూడెంలోనె పెట్టొద్దనె వాళ్ల మాట నెగ్గింది. ఈళ్ల పాపం పండెకాలం దగ్గర్లనె ఉంది. అయినా ఈళ్లను బతిమిలాడుడేంది. మీ ఊర్లనె పెట్టు, దేవుడనెటోడుంటె ఏడున్న సూస్తడు..." దగ్గుతు బాటిల్లో నీళ్లు తాగాడు.

కొద్దిసేపుదాక ఏం మాట్లాడాలో అర్ధంగాలె జ్వాన్నేసుకు, అతని మాటలు ఇంకా నమ్మబుద్ధికావటం లేదు. కారణం రాత్రి ఫాదర్‌తో మాట్లాడినపుడు ఎంత నమ్మకంగా మాట్లాడే, పెద్ద మనుషులను ఒప్పిస్తనని. దేవుని ప్రతినిధి ఫాదర్‌ను కాదంటరా దేవుని బిడ్డలు! అతని మాటినకపోతే ఫాదర్ గురుత్వానికి విలువేంది? ఆలోచనలతో చర్చి కంపౌండ్‌లోకి అడుగు పెట్టాడోలేదో,

"పూజ సమాప్తమైనది, వెళ్లి క్రీస్తు ప్రేమలో జీవించండి..."ఫాదర్ మాటలు వినిపించటంతో, వెంటనె పోయి చెట్టు కింద నిల్చున్నడు.

కొద్దిసేపటికి ఫాదర్ చర్చి నుండి తన నివాసానికి బయలుదేరి అతని దగ్గరకు రాగానే,

"స్తోత్రం ఫాదర్..." వినయంతో నమస్కరించాడు.

"స్తోత్రములు," ప్రతి నమస్కారం చెప్పుకుంటనె, "చూడు జ్వాన్నేసు ఊరి పెద్దమనుషులతో మాట్లాడా. ఎందుకో ఒప్పుకోవడం లేదు. నా పరిమితులు నాకుంటాయి గదా? నీవే పోయి పెద్ద మనుషులను ఒప్పించుకో," ఏదో అత్యవసర పనుందని చెప్పి తన నివాసంలోకి జారుకుండు ఫాదర్.

కొద్దిసేపుదాక ఏం జరిగిందో అర్ధంగాలె. పోయి తను దానం చేసిన బెంచి మీద దీనంగా కూర్చుండు. అంతా శూన్యంగా ఉంది. చర్చి వైపు చూశాడు. ద్వారం మీద రాసిన, 'భారముచే అలసి సొలసి ఉన్న సమస్త జనులారా, నా యొద్దకు రండి. మీకు విశ్రాంతి నొసగెదను!' మత్తయి వాక్యాలు ఓదార్పునివ్వటం లేదు.

ఈ మతంలున్న కులం గురించి అశోక్ వాదన చేసెటపుడు కొట్టిపారేసెటోడు జ్వాన్నేసు. ఈరోజు ఎందుకో మొదటిసారి సంఘర్షణ మొదలయింది.

చిన్నప్పరెడ్డి అన్నట్లు ఈ మతంలోకి ఎలా మారాల్సి వచ్చే?

జానయ్య జ్వాన్నేసుగా, ముత్తమ్మ మరియమ్మగా ఈ మతంలోకి ఎలా మారాడు! అప్పుడప్పుడు ఆలోచన వచ్చినప్పుడల్లా సువార్తమ్మ మీద పట్టరాని కోపమొస్తది.

జ్వాన్నేసు తండ్రి యాదయ్య గుంటూరు జిల్లా సరిహద్దులుండే ఓ ఊరు నుండి పక్కనున్న నల్లగొండ జిల్లాకు ఇల్లరికమొచ్చాడు. ఈ జిల్లాలోనె పదో తరగతి వరకు చదివి ఉండటం వల్ల ఓ బంధువు సహాయంతో హైస్కూల్‌లో యాదయ్యకు అటెండర్ ఉద్యోగమొచ్చింది.

యాదయ్యకున్న ముగ్గురు కొడుకుల్లో పెద్దోడు జానయ్య. పదో తరగతి వరకు చదివాడు. అనారోగ్యంతో యాదయ్య చనిపోవటంతో తండ్రి ఉద్యోగం జానయ్యకొచ్చింది. ఉద్యోగ విషయంలో అన్నదమ్ములకు గొడవలయినా మిగిలిన

వారికి చదువులేక జానయ్యకి దక్కింది ఉద్యోగం. ఇంటి దగ్గరున్న నాలుగెకరాలు, ఇల్లు ఇద్దరి తమ్ముల్లకు పోయింది. తల్లిని వారే చూసుకోవాలి.

యాదయ్య ఉద్యోగరీత్యా ఓ ప్రాంతంలున్నప్పుడు, బాగా పరిచయమైన కులపాయన కూతురు ముత్తమ్మను తన పెద్దకొడుక్కు చేసుకుంటానని, మాట వరుసకన్న మాట నిజమైంది. యాదయ్య చనిపోయాక ముత్తమ్మ తండ్రి జానయ్య దగ్గరికొచ్చి తండ్రి మాటను గుర్తుచేశాడు. ముత్తమ్మకు పెద్దగా చదువు లేకపోయినా చూడటానికి ఉన్నోళ్ల పిల్లలాగ అందంగా కనిపించెసరికి జానయ్య కాదనలేక పోయాడు

పెండ్లయి పదేండ్లు దాటిన పిల్లలు కలుగలేదు. కారణాలు చెప్పుకోలేక ఇబ్బందిగా ఉండేది ఇద్దరిలో. మిర్యాలగూడ, సూర్యపేట చివరికి హైద్రాబాద్ డాక్టర్లను కలిసి, మందులు వాడినా ఫలితం దక్కలె.

అప్పుడు ఉద్యోగరీత్యా నేరడుచర్ల దగ్గరుంటిరి. ఇంటి పక్కనె కులపామె సువార్తమ్మ ఉండేది. ఆమె బంధువుకు ఇట్లనె పిల్లలు లేకుంటె విజయవాడ గుణదల మాతను నమ్ముకుంటె పిల్లలు కలిగిన విషయం చెప్పేసరికి ముత్తమ్మలో ఆశ పుట్టింది. సువార్తమ్మ మాటలను నమ్మి, ఒకసారి గుణదల కొండకు, నాగార్జున సాగర్‌లోని సాగర్‌మాత దగ్గరకు, చివర తమిళనాడులోని వెలాంకిణి మాతను దర్శించుకున్నారు. అయినా పిల్లలు కలుగకపోయెసరికి సువార్తమ్మకు అనుమానమొచ్చి,

"ముత్తక్కా, ఇంత తిరిగిన ఫలితం లేదంటె, ఆ మాత మీ నుండి ఏదో కోరుకుంటుంది. నా మాటిని బాప్టిజం (జ్ఞానస్నానం) తీసుకోండి. ఆరోగ్యమాత తప్పక మిమ్మల్ని కనికరిస్తుంది," అంది

బాప్టిజం అంటె ఏమిటో ఇద్దరికి తెలియదు. సువార్తమ్మ తనకు తెలిసింది చెప్పింది.

జానయ్య కిష్టంలేదు, ముత్తమ్మ ఒత్తిడితో ఒప్పుకున్నాడు. ఇద్దరిని తీసుకపోయి అదే ఊర్లున్న చర్చి ఫాదర్ దగ్గరకు పరిచయం చేసి, వారి బాధ చెప్పింది. ఫాదర్ అంగీకరించి జపాలను నేర్చుకోమని చెప్పి, ఓ పుస్తకాన్నిచ్చాడు. దానిలోని పదాలు కొత్తగా, వింతగున్నయి! సువార్తమ్మ వాటికి అర్థాలను చెబుతు అనుదిన జపాలను నేర్పింది.

ముత్తమ్మకు పెద్దగా చదువు లేకపోయిన జ్ఞాపకశక్తి ఎక్కువ, జానయ్య కంటె ముందె రెండు నెలల్లో జపాలను కంఠత పట్టింది. చేతిల బైబిల్, జపమాల లేకుండ చర్చికెళ్లదు!

మతం మారాక తమ జీవితంలో మార్పులొస్తాయని ఆశతో ఎదురుచూశారు. అటువంటివి రాకపోగ ఓ ఇబ్బంది మొదలయింది. ఉద్యోగస్తుడయిన బంధువొకరు అనుకోకుండ జిల్లా పరిషత్‌లో కలిసినప్పుడు,

‘‘జానన్న బాగానె మతం మారినవుగాని, ఎవరన్న కాంప్లెయింట్ చేస్తే ఉద్యోగానికి ఇబ్బంది కదా, పైగా రికార్డు అసిస్టెంట్‌గా ప్రమోషన్ లిస్టుల ఉంటివి, పరిస్థితులు బాగలేవు...’’ అనేసరికి భయం పట్టుకుంది!

మారిన పేరు అందరికి చెప్పేటోడు కాదు. చర్చికి గూడ జాగ్రత్తగా ఎవరి కంట పడకుండ పోయి వస్తున్నడు! ఒక్కోసారి బార్యనొక్కదాన్ని పంపెటోడు చర్చికి. ఆ ఊరు నుండి ప్రమోషన్ మీద మరో ఊరుకు బదిలికావటంతో కాస్త ఊపిరి పీల్చుకున్నట్టయింది. అక్కడ తెలిసిన వారెవరు లేరు. నల్లగొండలున్న చర్చికి పోయెటోళ్లు.

పిల్లలులేని జీవితంలో ఇద్దరిలో అసంతృప్తి పెరగసాగింది. ఏమనుకుందో ఏమో,

‘‘నా ప్రాణం ఎట్లనో ఉంటుంది. కరుణను సాదుకుందమా?’’ ఉన్నట్టుండి ఓరోజు బర్తను బతిమిలాడింది

పేరుకె మరియమ్మ చెల్లె కూతురుగాని, చిన్నతనం నుండి వీళ్ల దగ్గరే పెరిగింది. కరుణంటె ఇద్దరికి పాణమె. ఆమె ఇంట్ల ఉంటె సందడిగ ఉంటది. చిన్నతనంలనె కరుణను దత్తత తీసుకుదామనుకున్నరుగాని, పిల్లలు కలుగుతరని ఇంతకాలం ఓపికతో ఎదురుచూశారు. ఆ ఆశ తీరే అవకాశం లేదు. జ్వాన్నేసు కాదన లేకపోయాడు.

తమ దగ్గరే ఉంచుకొని, నల్లగొండలో డిగ్రీ పూర్తి అవుతుండగానె, తనకు తెలిసిన క్రైస్తవ సంబంధం రావటంతో కట్నమిచ్చి పెండ్లి చేశారు. మనువడు, మనుమరాలు పుట్టడం, ఆ సంతోషంలున్న సమయంలో, జ్వాన్నేసు పదవి విరమణ కావటంతో ఎక్కడ ఉండాలనె సమస్య మొదలయింది.

ఊర్ల ఉన్న ఇల్లు, స్థలాలు తమ్ముల్లకు పాయె. పైగా వారితో సంబంధాలు సరిగా లేవు. మరియమ్మ ఊర్ల చెల్లె ఇంటి పక్కనున్న కులపోల్లు ఏదో ఆపదతో మూడొందల గజాల ఇంటి స్థలం, అర్థెకరం భూమి అగ్గువకు అమ్ముతుంటె చెల్లె బలవంతంతో చిట్టీ డబ్బులతో తీసుకుంది. అదిపుడు కలసొచ్చినట్టయింది. రిటైర్‌మెంట్ డబ్బులతో ఇల్లు కట్టుకున్నరు

మతాన్ని నమ్ముకున్న మరియమ్మ ప్రతి ఆదివారం చర్చికి పోవల్సిందె. లేకుంటె సైతాను పట్టినట్టుంటది. ఈ ఊర్ల ఆ చర్చిలేదు. అయిదు కిలోమీటర్ల

దూరంలో రెడ్డిగూడెంల చర్చి ఉంది. ఆ చర్చిల వీరికి బాప్టిజం ఇచ్చిన ఫాదరె ఉన్నాడని తెలిసి సంతోషంతో బర్తను తీసుకొని అతని దగ్గరకెళ్లింది. పాత పరిచయమె గనుక ఫాదర్ చాలా సంతోషించాడు. ఆ చర్చిల డబ్బులు కట్టి కుటుంబ కార్డు తీసుకుంది

"పచ్చల్లకు నాకు లోటు లేదు ఇప్పటి నుండి!" నవ్వుకుంట అన్నడు ఫాదర్

కారణం మరియమ్మ నాన్‌వెజ్ వంటకాలు బాగా చేసేది. చికెన్, మటన్, ఫిష్‌లతో పచ్చల్లు చేసి పంపిన వంటకాలు గుర్తొచ్చాయి ఫాదర్‌కు!

ఏ రోగం, నొప్పులొచ్చిన ఆరోగ్యమాత మీద బారం వేసేది. రోగాలు తగ్గితే మరియమాత విగ్రహాన్ని చర్చికిస్తానని మొక్కుకుంది. బిపి, షుగర్, థైరాయిడ్ రోగాలతో నెట్టుకొస్తున్నా, ఈసారి గర్భశయానికి సంబందించి సమస్య మొదలయింది. డాక్టర్లు అనుమానంతో గడ్డను కత్తిరించి పరీక్ష కోసం పంపారు.

పిహెచ్.డి చేస్తున్న చెల్లె కొడుకు అశోక్ హాస్పిటల్లో చూసుకుంటున్నడు. ఏమైందోగాని మరియమ్మ పరిస్థితి విషమించింది. డాక్టర్లు అశోక్‌కు ఏదో చెప్పారు. చివరిదశని అర్థమయినట్టుంది మరియమ్మకు. బర్తతో అంది హాస్పిటల్లో,

"నన్ను సమాధి ఏడచేస్తరు?" పెద్దనాన్నతో పెద్దమ్మ అంటుండగా అశోక్ ఈ మాటిన్నడు.

"గిప్పుడు గవన్నెందుకు?" కసురుకున్నడు జ్వాన్నేసు

"నా మాటిను, ఆ దేవుని పిలుపొస్తుంది నాకు. ఫాదర్‌కు చెప్పు, చర్చి పక్కనున్న సమాధుల్లో నన్ను పెట్టమని..."

పెద్దమ్మ ఎందుకు ఈ కోరిక కోరుతుందో అర్థంకాలె అశోక్‌కు! అంతిమ దినాన దేవుడు తిరిగి లేపి, స్వర్గానికి తీసుకెల్తాడనె పునరుత్తాన విశ్వాసం అతనికి తెలియదు. పెద్దనాన్న చెప్పాక అర్థమయింది

డాక్టర్లు లాబం లేదని చెప్పటంతో నిన్న మధ్యాహ్నం హైద్రాబాద్ నుండి మరియమ్మను ఇంటికి తీసుకొచ్చారు.

ఫాదర్‌కు ఫోన్ చేసి చెప్పటంతో కాటకిస్టుతో వచ్చి మంచి మరణానికి 'అవస్థ అభ్యాంగం' ఇచ్చారు. ఫాదర్‌ను ఏదో అడుగుదామని ప్రయత్నించిందిగాని, నోటి మాట పడిపోయింది మరియమ్మకు. ఆ రాత్రె చనిపోయింది...

*

ఫాదర్ పెద్దమనుషుల మీద పెట్టె, మరోసారి శౌరిరెడ్డిని కలిస్తే? చివరి ఆశతో బయటకొచ్చి అతని దగ్గరకు పోదామనుకుంటుండగానె, హీరోహోండా మీద పోతున్న శౌరిరెడ్డి కనిపించిండు. గట్టిగా పిలిచాడు. అతనికి వినిపించినా, విననట్టు వేగంగా వెళ్లిపోయాడు.

అప్పుడే మిత్రునితో బైక్ మీద వచ్చిన అశోక్, ఇది గమనించి కోపంతో, ''అక్కడ శవం పెట్టుకుని ఈడున్నవు, ఏమన్న పిచ్చా నీకు?''

''కాదురా, మీ పెద్దమ్మ చివరి కోరికరా, సమాది ఈడనె పెట్టాలని...'' ఏడ్వసాగాడు.

'''ఏంది పెద్దనాన్న, ఇంత అమాయకంగా ఆలోచిస్తే ఎలా చెప్పు? అంతో ఇంతో చదువుకున్నోనివి. వీళ్లు మనల్ని ఎలా కలుపుకుంటరనుకుంటున్నవు? అది జరగాలంటె క్రీస్తులాంటోళ్లు చాలామంది పాణమివ్వాల్సుంటది.

''అయినా నీకిపుడు చెప్పిన అర్థంకాదుగాని, మనూర్లనే సమాధి తీపిస్తున్న, పెద్దమ్మ విశ్వాసాలతోనె సమాధి చేసుకో. ఆ ఫాదర్ వచ్చి సమాధి దగ్గర ప్రార్థన చేస్తడో లేదో కనుక్కో...'' అశోక్ మాటలతో ఆలోచనలపడి, చిన్నప్పరెడ్డి చెప్పినట్టు సమాధి ఎక్కడ ఉంటేంది, దేవుడు వస్తడు గదా? ఫాదర్‌కు ఫోన్ చేశాడు.

ఏదో మీటింగ్ ఉండటంతో ఆ ఫాదర్ రాలె. తన సహాయక ఫాదర్‌ను పంపాడు. ఆ ఫాదర్ తన కార్లో ముగ్గురు మహిళాగాయకులను, కాటకిస్టును తీసుకొచ్చాడు.

అంతకుముందె వచ్చిన చిన్నప్పరెడ్డి శవపేటికను అలంకరించసాగాడు. మరియమ్మ బంధువులకు ఇదంత కొత్త. ఈ తతంగాన్ని చిత్రంగా చూడసాగారు!

శవాన్ని ఎత్తేముందు, ఎత్తుకొని పోయెటపుడు, సమాధి దగ్గరకు పోయాక, సమాధిలో పెట్టెటపుడు చదివే జపాలు అయిపోయాక, వచ్చిన గాయక బృందం పాటను అందుకున్నారు.

*మట్టి నుండి వచ్చిన ఈ శరీరం*
*మట్టిలోనె కలవాలి*
*స్వామి నీవిచ్చిన ఈ ఆత్మ తిరిగి*
*నీ చెంతకు చేరాలి...*

పాట పాడుతుండగానె, సమాధిలోకి దిగి చిన్నప్పరెడ్డి శవపేటికను జాగ్రత్తగా లోపల పెట్టి బయటకొచ్చాడు. అంతా అయిపోయాక దినాలు ఏరోజు ఉంటయో అక్కడె ప్రకటించాక వచ్చినవారు ఎటటు వెళ్లిపోసాగారు.

అప్పటిదాక పూజా కార్యక్రమాలు నిర్వహించిన ఫాదర్‌ను బాగా పరిశీలించిన అశోక్, అతన్ని పక్కకు తీసుకపోయి, తనను పరిచయం చేసుకొని, ఆ ఫాదర్‌ది ఏ ప్రాంతం, ఇంటి పేరుతో సహా అడగటంతో ఫాదర్ కులం ఏమిటో అర్థమయింది. ఫాదర్‌గూడ అశోక్ ఎందుకు అడుగుతున్నాడో అర్థం చేసుకొని నవ్వి వెళ్లిపోయాడు!

ఆ ఫాదర్ పేరు దాసరి కరుణాకర్, ఆంధ్ర ప్రాంతంవాడు. ఆ ఇంటి పేరున్న మిత్రులున్నారు అశోక్‌కు!

*

"దినాలయ్యేదాక పనులు పెట్టుకోకురా," పెద్దనాన్న అనేసరికి కాదనలేక పోయాడు.

ఫిలాసఫిలో చేస్తున్న రిసెర్చి చివరిదశలుంది. అత్యవసర పనులుంటె కరుణకు చెప్పి యూనివర్సిటికి పోయి వస్తున్నడు.

పెద్దమ్మ మరణం పిదప జరిగిన సంఘటనలు ఆలోచనల్లో పడేసినయి అశోక్‌ను. తన మిత్రులతో ఈ విషయాన్ని షేర్ చేసుకుండు. కింది కులాల నుండి ఈ మతంలోకి మారిన వారి అనుభవాలు ఒక్కో కులానికి ఒక్కో అనుభవం!

తమ బంధువుల్లో ఈ రోమన్ కాథలిక్ మతంలోకి మారినవారు లేరు పెద్దమ్మ తప్ప. ఈ వూర్ల రెండు ప్రొటస్టంట్ చర్చిలున్నాయి. ఒకటి మాదిగలకు, మరోటి మాలలకు. ఏ కులం వారికి ఆ కులపువారె చర్చి ఫాస్టర్! వీటికితోడు ఈమధ్య యాదగిరిగుట్ట నుండి బుడిగ జంగపోళ్ల యోసేప్ ఈ ఊర్ల పవర్ ప్రేయర్ చర్చి స్థాపించి నడపటం మాలమాదిగ ఫాస్టర్లకు మింగుడుపడటంలేదు. కారణం బుడగ జంగపోళ్లు పవర్ ప్రేయర్ చర్చికి పోవడం వల్ల!

కాని ఓ సమస్య వస్తుంది. ఈ మతంలోకి పోయినోళ్లు ఎవరైన చనిపోతె, క్రైస్తవ సాంప్రదాయాల ప్రకారం సమాధి చేయలేనివారు, తిరిగి కుల కట్టుబాట్ల ప్రకారం అంత్యక్రియలు జరగాలంటె కులపెద్దలు చెప్పినట్టు వినాల్సిందె. శవం లేవాలంటె డప్పు మోగాల్సిందె!

అశోక్ ఈ సమస్యను ఎదుర్కొన్నడు. ప్రజలతో అందులో కులపెద్దలతో ఎలా వ్యవహారించాలో తెల్సినోడు గనుక తెలివిగా ఒప్పించి ఆశ చూపటంతో వాళ్లు అంగీకరించారు.

కుల నిర్మూలన, వివిద ఉద్యమాలలో పరిచయమున్నా, ఈ మత మార్పిడిలో ఇన్ని చిక్కులున్నాయని అర్థంకావటం ఇప్పుడే! వారంరోజుల నుండి సమయం చిక్కినపుడల్లా ఈ మతానికి సంబంధించిన విషయాలు పెద్దనాన్నతో మాట్లాడేవాడు. పెద్దమ్మ ఈ మతంలో ఇంత మమేకం కావటం అర్థంగాని ప్రశ్నగా మిగిలిపోయింది. చర్చి ఫాదర్‌తో మాట్లాడాలని బలంగా ఉంది. ఆ గూడెంలున్న మిత్రుల ద్వారా ఆ ఫాదర్ వివరాలు తెలుసుకున్నడు. పెద్దమ్మ గొడ్డు కూరనె ఇంట్లకు తేనియ్యదు. అటువంటిది ఈ గూడెంలా పండుగలకు చిన్నప్పరెడ్డి ఖచ్చితంగా పందులు కోయాల్సిందే. ఇదీ తెలిసి కూడ చిన్నప్పరెడ్డిని ఇంట్ల ఎంత మర్యాద చేస్తది!

అశోక్ చిన్నతనంలో అతని తండ్రి ఈ రెడ్డిగూడెంలో జీతమున్నోడే. పండుగలకు, పెండ్లిండ్లకు, సావులకు తండ్రితో కలిసిపోయిన చిన్ననాటి జ్ఞాపకాలున్నాయి. ఈ గూడెం వారి ఆహారం, ఆహార్యాలలో చాలా తేడాగా ఉండేది. అసలు వీరి గూడెం ఓ ప్రత్యేక నిర్మాణంగా కనిపించేది!

ఈ గూడెం వారు ఆంధ్ర, ముఖ్యంగా గుంటూరు జిల్లా నుండి వలస వచ్చిన రోమ్ కాథలిక్ క్రైస్తవులు. స్వాతంత్రానికి ముందు ఆంధ్రలో వచ్చిన కరువు కాటకాల్లో క్రైస్తవ మిషినరీలు నడిపిన గంజి కేంద్రాల్లో కులమత తేడాలు లేకుండా కడుపు నింపుకొని బతికి బట్టకట్టినవారు. వీరేకాక ఇతరులు కూడా అనేక కారణాలతో క్రైస్తవానికి మారారు.

తెలంగాణలో సారవంతమైన నల్ల రేగడులు ఉన్నాయని గుర్తించిన కొంత మంది, అక్కడ ఉన్న కొద్దిపాటి భూములను, ఆస్తులను అమ్ముకొని తక్కువ ధరకు దొరికే భూముల కోసం నైజాం రాజ్యంలోకి వచ్చారు. అప్పటి నైజాంరాజు కూడా ఆంధ్రవాసులను ఈ ప్రాంతంలోకి వలసలను ప్రోత్సహించడం కూడా కారణం కావచ్చు. ఇలా వచ్చినవారిలో రెడ్లు, కమ్మలు కూడా ఉన్నరు. తెలంగాణవ్యాప్తంగా కమ్మ, రెడ్ల పేర్లతో ఉన్న గూడేలల్లో వీరు కనిపిస్తారు.

కమ్మ, రెడ్ల క్రైస్తవులు వేరే వేరు గూడాలల్లో స్థిరపడినా, అక్కడక్కడ కొన్ని గ్రామాలల్లో కమ్మ, రెడ్లు, బిసిలు అయిన తొగటలతో స్థిరపడ్డారు. వీరంతా ఒకే పారిష్, గూడెంలో ఉన్న, ఒకే చర్చిలో ప్రార్ధనలు చేసిన ఎవరి కుల పరిమితుల్లో వారు జీవించేవారు. పరిచయాలతో ఫంక్షన్లకు పిలుచుకోవడం తప్ప, ఎవరి కులంలో వారికే పెండ్లిల్లు జరుగుతయి, అప్పుడప్పుడు ప్రేమ పెండ్లిల్లు, లేచిపోవడాలు జరిగితే తప్ప!

ఇప్పుడిప్పుడే అనివార్యంగా కొన్ని మార్పులు వస్తున్నాయి. బయట రాష్ట్రాల్లో, దేశాల్లో బతికే ఈ కమ్మ, రెడ్డి యువతి, యువకులకు తమ తమ కులాల్లో సరియైన సంబంధాలు లభించక, క్రింది కులాల క్రైస్తవులను వెతుకుతున్నారు!

*

ఈ వారంరోజుల నుండి పెద్దనాన్న వ్యవహారాన్ని, మాటల్లోని మార్పును గమనించసాగాడు అశోక్.

‘‘అశోక్, ఎన్ని మేకలు కోస్తున్నర్రా?’’ బజార్ల డెబ్బయి ఏళ్ల నర్సయ్య అడగటంతో

‘‘మనోళ్లకు సరిపోయినన్ని కోస్తున్నంలె తాత!’’ నవ్వుకుంట జవాబిచ్చాడు.

దినాలు రెండు రోజులుందనగా పెద్ద ఫాదర్, సహాయక ఫాదర్ కారులో వచ్చారు. కారు దిగి ఇంట్లకొస్తున్న, వారికి ఎదురుపోయి ఎప్పటిలాగ ఆహ్వానించలె జ్వాన్నేసు. ఆశ్చర్యమనిపించింది అశోక్‌కు!

"బాగున్నవా జ్వాన్నేసు," పలుకరించాడు పెద్ద ఫాదర్.

"ఆ ఇట్లున్న..." ఎప్పుడు ఫాదర్ అని సంబోదించెటోడు. ఈసారి అనలె!

ఇద్దరు ఫాదర్లు ఎదురుగున్న మరియమ్మ మరణ పోటో దగ్గరికి పోయి, పూలేసి ప్రార్థన చేసి వచ్చి కూర్చున్నాక,

"జ్వాన్నేసు, రేపు ప్రత్యేక పూజ పెట్టించుకుంటవా మరియమ్మ జ్ఞాపకార్థం?" చిన్న ఫాదర్ అడిగాడు.

"ఇంకా ఏమి అనుకోలేదు. బంధువుల్ని, కుల పెద్దలను అడిగి చెబుత," అన్నడు ముక్తసరిగా

జాన్వేస్ మాట తీరులో మార్పుల్ని పసిగట్టి, "సమాధి విషయంలో నా మీద కోపంగా ఉన్నట్టుంది? అయినా గూడెంవాళ్లను కాదని నేనేమి చేస్తా జ్వాన్నేసు," తన నిస్సాహాయతను ఒప్పుకున్నడు పెద్ద ఫాదర్.

"మంచిది, జరిగిందేదో జరిగింది. మీ కులస్థుతో నీకు ఇబ్బందులున్నట్టె, నా కులస్తులతో నాకు ఇబ్బందులొస్తున్నయి. మతంలోకి పోయినోనివి ఆడనె సమాధి పెట్టుకోక మాళ్లా ఈడి కెందుకొస్తున్నవని మా కులపోళ్లు మాటలనబడితిరి. నీ కులస్థులతో నీకు, నా కులపోళ్లతో నాకు గొడవలెందుకు? ఇంతకుముందు ఎట్ల బతికిన్నో అట్లనె బతుకుత, ఇప్పటి సంది నన్ను జ్వాన్నేసు అనొద్దు, జానయ్యగా పిలువండి..." అని లోపలి రూంలకు పోతున్న పెద్దనాన్నను ఆశ్చర్యంగా చూస్తుండి పోయాడు అశోక్!

ఊహించని సంఘటనతో ఇద్దరు ఫాదర్లకు నోటమాట రాకుంటయింది. కులపరంగా ఇద్దరి ఫాదర్లకు ఎవరి అనుభవాలు వారికున్నాయి. ఏదో బోధిద్దామని దీనిలోకొచ్చారుగాని ఈ జీవితాల్లో ఉన్న డొల్లతనం వారికి బోదపడింది.

తన వైపు నుండి జరిగిన తప్పు అర్థమయింది పెద్ద ఫాదర్‌కు. కులస్థులను కాదని మరియమ్మ కోరికను తీర్చె అధికారం, శక్తి తనకుందా? కులమెంత బలంగా ఉందో అర్థం చేసుకోసాగాడు. ఈ అసమానతలు క్రీస్తు బోధనలకు విరుద్ధమని తెలుసు. అపరాధ బావనలో పడిపోయాడు.

ఇదంత గమనిస్తున్న అశోక్, "ఫాదర్ అంతోనిరెడ్డిగారు, పెద్దమ్మ పోయిన దగ్గరి నుండి పెద్దనాన్నకు గాలి తప్పినట్టయిండు. అయిందానికి కాందానికి కోప్పడు

తుండు. ఏమనుకోవద్దు,'' విషయాన్ని మళ్లిద్దామనుకుంటుండగా కరుణమేరి ఫాదర్లకు గుడ్ మార్నింగ్ చెప్పుకుంట టీ అందించింది.

కరుణ పెండ్లి పెద్ద ఫాదర్ చేసిందె. వేరే పారిష్లున్న మరియమ్మ వత్తిడితో వప్పుకొని చేశాడు. ఆ పెండ్లి సమయంలో కరుణ పేరు కరుణ మేరిగా మార్చింది మరియమ్మ.

''నీవు నాస్తికునివటగా, ఎలాగన్న నీకు బాప్టిజం ఇప్పియాలని మీ పెద్దమ్మ అనేది!''

''అట్లనా!'' మాటల్లో పెద్ద ఫాదర్తో పెరిగిన సాన్నిహిత్యాన్ని అవకాశంగా తీసుకొని,

''ఫాదర్ తత్త్వశాస్త్ర విద్యార్థిగా అన్ని మతాల సారాంశాన్ని చదువుకున్నవాన్నె. మీరు థియాలజి చదివినరు. మీ మతంలున్న ప్రేమ, కరుణ, సమానత్వ భావన గౌరవిస్తా. మమ్మల్ని మనుషులుగా గుర్తించని కాలంల, మావోళ్లకు మీ స్కూళ్ల చదువు చెప్పి, గుడిలకు రానిచ్చినరు. ఈ రెడ్డిగూడెం చర్చి స్కూల్లో చదివి బాగు పడ్డోన్నే...

''కాని ఒక దగ్గర విఫలమైనరు! ఈడున్న కులాన్ని వ్యతిరేకించక పైగా దానితోనె సర్దుబాటు చేసుకున్నరు. మీ మతమే దానిల చిక్కుకుంది. జిల్లా డయాసిస్లో (పీఠంలో) మత గురువులు రెడ్లు, కమ్మలు, బిసి, దళిత కులాలుగా ఎట్ల చీలిపోయి ఉన్నారో నాకన్న మీకే బాగా తెలుసు! మా పెద్దమ్మ ఏదో ఆశతో కులాన్ని వద్దనుకొని మీ మతంలోకి మారాక గుర్తింపు, హోదా పెరిగిందనుకుంది. ఆమె విశ్వాసాన్ని పెద్ద కులపోళ్లు దెబ్బతీసినరు. అగ్రకులాలు తమ సమాధుల పక్క కింది కులాల వారిని పెట్టుకోవడమే ఒప్పుకోనివారు, తమతో సమానంగా ఎదగడం వాళ్లు ఎలా భరిస్తారు? సమానత్వ భావన ఇప్పట్లో అమలయ్యేది కాదని అర్థం కాకుండానె చనిపోయింది పాపం.

''ఇప్పటికే మేము మావికాని నమ్మకాలు, ఆచారాలతో బతుకుతూ బాధపడు తున్నం. మమ్మల్ని అగ్రకులాలు వాళ్ల పాదాల కిందుంచటానికి కులాన్ని వాడుకుంటూ, అదే ధర్మమంటున్నరు. వాళ్ల ధర్మాన్ని కాదంటుంటె మమ్మల్ని అధర్ములుగా, జాతిద్రోహులుగా నిందలేస్తున్నరు. ఆ కాలంనాటి ధర్మాన్ని, చట్టాలను ధిక్కరించాడనేగ కుట్రమోపి క్రీస్తును చెరసాలలో పెట్టి చంపింది. ఎక్కడో పరలోక రాజ్యసుఖాలు మాకొద్దు. ఈ లోకంల మా కష్టాల గురించి మాట్లాడితే సాలు...'' ఫాదర్లు తాగిన టి కప్పులను తీస్తూ అన్నడు అశోక్!

ఏం మాట్లాడాలో అర్థం కావటంలేదు. క్రీస్తుతత్త్వాన్ని సంవత్సరాలుగా బోధిస్తున్నవాడే, ఇలాంటి అనుభవం ఎదురవటం మొదటిసారి. దీన్ని పరిష్కరించటమేమోగాని, సమస్యను అర్థం చేసుకోటానికే పెద్ద ఫాదర్ ఇబ్బంది పడుతుంటె, ఇప్పటిదాక అశోక్ మాట్లాడిన మాటల్లోని భావాన్ని ఎట్లర్థం చేసుకున్నడో గాని చిన్న ఫాదర్ కరుణాకర్, చొరవతో జానయ్య దగ్గరకు పోయి,

"చూడు జ్వాన్నేసు! ఈ లోకంల ఇటువంటి కష్టాలొచ్చాయని ఆ దేవుని ప్రేమను మరువొద్దు. ఆ దయామయుడు తప్పక తన రాజ్యంలో మన కష్టాలు తీరుస్తడు..." ఏదో చెప్పబోతుండగా.

"వొద్దు కరుణాకర్‌గారు, నాకేమి చెప్పొద్దు, ఆ రాజ్యంలకు మీరే పోండి. కష్టమో నష్టమో ఈడనె అనుభవిస్తా. నా భార్యతోనె అన్ని పోయినయి. అయినా నీ పిచ్చిగాని మా అశోక్ అంతగానం చెప్పినా ఇంకా అర్థం కావటంలేదా? వాళ్ల కులపోడు చెబితెనె వాళ్లినరైతిరి. కులం కానోడివి నీ బోధనలను వాళ్లింటరా! నాలుగు మంత్రాలు చెప్పి, మతంలకు మార్చుకున్నంత సులబం కాదు మనుషుల్ని మార్చడ మంటే..." సహనం నశించి అన్నడు జానయ్య,

*అరుణతార మాసపత్రిక*
*మే 2022*

✻



10 అక్టోబర్ 1965న నల్గొండ జిల్లాలో పుట్టిన పి. చిన్నయ్య మొదటి కథ *బండ పగిలింది* ఫిబ్రవరి 1996లో మన సమాజం పత్రికలో అచ్చయ్యింది. పయిలం, ఊడలమర్రి కథాసంపుటాలు ప్రచురించారు. ముప్పై కథలు రాశారు. ఉపాధ్యాయ వృత్తి. విప్లవ రచయితల సంఘంలో క్రియాశీల సభ్యులు.

*చిరునామా: మోటకొండూరు పోస్ట్, యాదగిరిగుట్ట మండల్, యాదాద్రి భువనగిరి జిల్లా - 508 286 ఫోన్: 99499 27976*